

వర్ధన్నపేట సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేశ్, మేయర్ సుధారాణి, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

# జన నేత రాకకోసం..

## నేడు ప్రజా ఆశీర్వాద సభలకు ముఖ్యమంత్రి కేసీఆర్

- మానుకోట శివారు శనిగపురంలో మహబూబాబాద్, నగర శివారు భట్టుపల్లిలో వర్ధన్నపేట నియోజక వర్గ సభలకు ఏర్పాట్లు పూర్తి
- ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, అరూరి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆయాచోట్ల మంత్రి సత్యవతి, చీఫ్‌విప్ దాస్యం, ఎంపీ కవిత పర్యవేక్షణ

మహబూబాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ)/ మడికొండ : బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మానుకోట శివారులోని శనిగపురంలో నిర్వహించే మహబూబాబాద్ నియోజకవర్గ సభ, మధ్యాహ్నం 3గంటలకు నగర శివారులోని భట్టుపల్లిలో నిర్వహించే వర్ధన్నపేట నియోజకవర్గ సభకు హాజరవుతారు. ఈ మేరకు ఆయాచోట్ల హెలిప్యాడ్‌లు, సభావేదికలను సిద్ధం చేశారు. ఆయా చోట్ల ఏర్పాట్లను మంత్రి సత్యవతి రాథోడ్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, అరూరి రమేశ్, మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. మానుకోట పట్టణంతో పాటు, వరంగల్ నగర శివారు అంతటా గులాబీమయమైంది. సభలను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు చేశాయి. బతుకమ్మలు, బోనాలు, వివిధ కళారూపాలు, డప్పులు, కోలాట నృత్యాలతో సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### మధ్యాహ్నం 2గంటలకు మానుకోట సభ..

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ సభ అనంతరం మధ్యాహ్నం 2గంటలకు మానుకోటకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ, బీఆర్‌ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సీఎం సభ కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, ఒక మున్సిపాలిటీ నుంచి 70 వేలకు పైగా ప్రజలను సభకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది జనవరి 12న మహబూబాబాద్ జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్, సమీకృత కలెక్టరేట్‌ను, బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తాజాగా ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మానుకోట నియోజకవర్గ కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. సభాస్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను గురువారం మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి పరిశీలించారు. 500 మందితో పోలీస్ బందోబస్తు చేపడుతున్నారు. నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనాల కోసం శనిగపురం వద్ద, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ రూరల్ మండలాల నుంచి వచ్చే వాహనాల కోసం ఫాతిమా స్కూల్ సమీపంలో, బాలాజీ గార్డెన్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.



మహబూబాబాద్ శివారులోని శనిగపురంలో చేస్తున్న ఏర్పాట్లు




శనిగపురంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

### వర్ధన్నపేట సభకు 80 వేలమందికిపైగా వచ్చే అవకాశం

గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ భట్టుపల్లి శివారులో నిర్వహించే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు సుమారు 8వేల మందికిపైగా తరలివచ్చే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. సభాస్థలం, పార్కింగ్, హెలిప్యాడ్ ఏర్పాట్లను గురువారం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్, మేయర్ గుండు సుధారాణి, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరిశీలించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు పెట్టారు. 20 ఎకరాల్లో సభాస్థలం, 100 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. తాగునీరు, మజ్జిగను పంపిణీ చేయనున్నారు. పోలీసులు హెలిప్యాడ్, సభావేదిక పరిసరాలను డాగ్‌స్క్వాడ్, మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి. పక్కన ఎంపి కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

# కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): ప్రజా సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం మహబూబాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి సత్యవతి మాట్లాడారు. రైతుబంధు పథకం ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంపై రైతులపై వారికి ఏ మేర ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. యాసంగి పంటకు రైతుబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు. రైతులకు 3 గంటల కరెంటు కావాలన్న కాంగ్రెస్ కావాలో.. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రైతుబంధును అడ్డుకునేలా కుట్రలు చేస్తున్న హస్తం పార్టీని బొందపెట్టాలన్నారు. కర్ణాటక తరహాలో ఇక్కడ ఆరు గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని, కన్నడ రైతులు కొడంగల్‌లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలుపుకోలేదని, ముందు ఆ పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో గ్యారెంటీ ఇవ్వాలన్నారు. ఎవరు ముఖ్యమంత్రి అనే క్లారిటీ మీకే లేనప్పుడు మీ గ్యారెంటీలను ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న పథకాలకు పేర్లు మార్చి కాంగ్రెస్ డిక్లరేషన్ పేరుతో ప్రకటించిందన్నారు. గత ఎన్నికల మాదిరిగానే బీజేపీకి 100 స్థానాల్లో డిపాజిట్లు వస్తే మహా ఎక్కువ అని అన్నారు. మేము అభ్యర్థులను ప్రకటించి ప్రజాక్షేత్రంలో ముందున్నామని, కాంగ్రెస్, బీజేపీలు మాత్రం సీట్ల కోసం కొట్లాడుకుంటున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలు సీట్లు పంచుకునేలోగా మేము స్వీట్లు పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సాగు, తాగు, సంక్షేమ రంగాలను సమానంగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పాత పథకాలను కొనసాగిస్తూనే కొత్తగా కీలక సంక్షేమ పథకాలను కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించారన్నారు. మహబూబాబాద్ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశామని, ఇంకా అనేక అభివృద్ధి పనులు కొన సాగుతున్నాయని వివరించారు. పదేళ్లకు ముం దు మానుకోట, ఇప్పటి మానుకోటకు ఉన్న వ్యత్యాసం మనం కళ్ల ముందు చూస్తున్నామన్నారు. పథకాల లబ్ధిదారులంతా బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలని, సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి, శంకర్‌నాయక్‌ను మూడోసా రి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. రైతుల కష్టనష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయాన్ని దశల వారీ గా 16వేలకు పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించ డం గొప్ప విషయమన్నారు. కేసీఆర్‌కు మానుకోటపై ప్రత్యేక ప్రేమ ఉందని, నేడు అభివృద్ధిలో మహబూబాబాద్ దూసుకుపోతోందన్నారు. మానుకోట ప్రజలు మేధావులు, విద్యావంతులు, యువకులు, మహిళలు, వ్యాపారులు ఆలోచించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ కు 70 వేల మంది హాజరు కానున్నారని, అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇంటికొకరు చొప్పున పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, మహబూబ్ పాషా, మర్రి రంగారావు, పరకాల శ్రీనివాస్ రెడ్డి, కేఎస్‌ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వారి పథకాలకు గ్యారెంటీ, వారెంటీ లేదు

- ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ వస్తున్నయ్
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- రైతుబంధును నిలివేయాలని కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం దుర్మార్గం
- బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్

మడికొండ, అక్టోబర్ 26 : గ్యారెంటీ, వారెంటీ లేని పథకాలతో కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాయని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను సైతం తెలంగాణ సంక్షేమ పథకాలు కావాలని అక్కడి ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను దేశమంతా కోరుకుంటున్నదన్నారు. భట్టుపల్లిలో నేడు జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణంలో గురువారం ఆయన బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమేనని, ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చినా తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను సభలో కేసీఆర్ వివరిస్తారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ వంద సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కూడా సభకు శ్రేణులను తరలించనున్నట్లు తెలిపారు. అరూరి రమేశ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలపై ప్రేమ ఉంటే రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఎందుకు ఫిర్యాదు చేస్తుందని ప్రశ్నించారు. 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తుంటే మూడు గంటలే సరిపోతుందని చెప్పిన రేవంత్‌రెడ్డి.. గతంలో కాంగ్రెస్ 9గంటలు ఇస్తామని చెప్పి మూడు గంటలు మాత్రమే కరెంటు ఇస్తే రైతులు పంటలు పండక విలవిలలాడారని గుర్తు చేశారు. రైతుబంధును నిలిపివేయాలని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడం దుర్గార్గమైన చర్యగా అభివర్ణించారు. 2014, 2018 ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని సీఎం కేసీఆర్ కల్పిస్తే నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీని అందించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఇంటి బిడ్డగా కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నానని చెప్పారు. అన్ని నియోజకవర్గాలకు దీటుగా వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రూ.400 కోట్లతో విలీన గ్రామాలను బాగుచేశామని, ఆకేరు వాగుపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. నియోజకవర్గ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం వల్ల ప్రతి మండలంలో క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటు చేసి సహాయకుడి ద్వారా ప్రజా అవసరాలను తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మూడోసారి కూడా సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని ప్రజలు ఆశీర్వదించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని చెప్పారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు సమప్రాధాన్యం కల్పిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజా ఆశీర్వాద సభకు మహిళలు గడపగడప నుంచి తరలివచ్చి సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, నాయకులు జయపాల్‌రెడ్డి, నార్లగిరి రమేశ్, పోలెపల్లి రామ్మూర్తి, కర్ర హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్, పక్కన చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్